ప్రజాప్రతినిధులకు విలువేదీ?

- ప్రభుత్వ కార్యక్రమాలకు అందని ఆహ్వానాలు
- కూటమిపాలనలో యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘన
- ప్రభుత్వ కార్యక్రమాల్లో అనధికారిక వ్యక్తుల పెత్తనం
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు



ఓడీచెరువు మండలం సున్నంపల్లి రెవెన్యూ సదస్సులో ఒక్క ప్రజాప్రతినిధి లేని దృశ్యం(ఫైల్)

ఓడీచెరువు: కూటమి సర్కార్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది. ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధులను డమ్మీలుగా మార్చేశారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు మెజారిటీ సంఖ్యలో ఉన్నప్పటికీ... మైనార్టీ గా ఉన్న తెలుగుదేశం పార్టీ సభ్యులదేపై చేయిగా సాగుతోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ప్రాతినిధ్యం ఏమీ ఉండడం లేదు. పుట్టపర్తి నియోజకవర్గంలో మొత్తం 69 ఎంపీటీసీ స్థానాలుండగా 66 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారే గెలుపొందారు. అలాగే 79 పంచాయతీలకు గాను 69 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

అంతటా వారిదే పెత్తనం

ఎక్కడికక్కడ అధికార తెలుగుదేశం పార్టీ నాయకులే అనధికార ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారు. పాలనా వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారు. అధికారులపై కర్ర పెత్తనం చేస్తున్నారు. తాము చెప్పినట్టే వినాలని, నడుచుకోవాలని అందుకు భిన్నంగా వ్యవహరిస్తే అధికారులను దూషణలు, వేధింపులు, ఒత్తిళ్లతో మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించడం, భౌతిక దాడులకు పాల్పడడం, దౌర్జన్యాలకు దిగడం చేస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా కూటమిపాలన సాగుతుండడం చూసి జనం విస్తుపోతున్నారు. తాము ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించిన వారిని కాదని ఎవరో అనామకులు, నేర చరిత కలిగిన వాళ్లు అధికార పార్టీ నాయకులం అన్న ముద్ర వేసుకొని అంతా తామై వ్యవహరిస్తుండడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లుగా భావిస్తున్నారు. తమను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రస్తుత కూటమి పాలనలో లేకుండా పోవడంపై వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌ల వివరాలు..

మండలంపేరు	ఎంపీటీసీలు	సర్పంచ్‌లు
అమడగూరు	08	10
ఓడీచెరువు	14	14
నల్లమాడ	13	14
బుక్కపట్నం	11	12
కొత్తచెరువు	15	15
పుట్టపర్తి	08	14

కార్యాలయాలకు వెళ్లడమే మానుకున్నాం



కూటమి ప్రభుత్వంలో అధికారుల తీరు నచ్చక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడమే మానుకున్నాం. ప్రోటోకాల్ అసలు పాటించడంలేదు. గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులకు ఆహ్వానం ఉండదు. పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో మా పాత్రం శూన్యంగా మారింది. కేవలం కూటమి నాయకులు ఇచ్చిన జాబితానే తుది జాబితాగా ప్రకటించి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం పాలు చేస్తున్నారు.

– కుర్లి దామోదర్‌రెడ్డి
ఓడీచెరువు జెడ్పీటీసీ

ప్రజలకు సమాధానం చెప్పలేకున్నా



కూటమి ప్రభుత్వంలో సర్పంచులు కేవలం వీఎల్‌సీలు ఇవ్వడానికి మాత్రం పరిమితం అయిపోయాం. గృహ నిర్మాణం, మినీ గోకులం షెడ్ల లబ్ధిదారుల ఎంపికలో మాకు సంబంధంలేనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. పథకాల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పలేకున్నాం. నిధులను పోగొట్టుకొనలేక వీఎల్‌సిలు ఇస్తున్నాం.

– బి.లక్ష్మీనరసమ్మ, తుమ్మల సర్పంచ్,
అమడగూరు మండలం

ఎన్నో ఆశలతో గెలిపించుకున్నాం



స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచివాళ్లు, యోగ్యులు అని అడిగిన వెంటనే పనిచేసిపెడతారని ఎంతో నమ్మకంతో ఎంపీటీసీలు, సర్పంచులను గెలిపించుకున్నాం. కానీ ప్రస్తుత తరుణంలో ప్రజా ప్రతినిధులైన వారినే పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాక్రమాల్లో ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం లేకుండా చేస్తున్నారు. అధికారులు పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధులను గౌరవించాలి.

–దండగల జనార్దన్, కుసుమవారిపల్లి
ఓడీచెరువు మండలం

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కదిరి నియోజవర్గంలోని ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వాటికి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట దినోత్సవం


కలశాలలో పవిత్ర గంగా జలాన్ని తెస్తున్న మహిళలు

తాడిమర్రి: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ఆర్యవైశ్యులు కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఉంచి వీరభద్రయ్యస్వామి ఆలయం వరకూ ఊరేగించారు. అక్కడ నుంచి ఆర్యవైశ్య ముత్తయిదువులు కలశాలలో పవిత్ర గంగా జలాన్ని తెచ్చారు. అనంతరం ఆలయంలోని అమ్మవారి విగ్రహానికి పంచామృతం అభిషేకం, పవిత్ర గంగా జలాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత కుంకుమార్చన, మహాగణపతి పూజ, విష్ణు సహస్రనామ పారాయణం తదితర పూజలు చేశారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మహిళలు సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు.

‘విజయభేరి’ని జయప్రదం చేయండి

కదిరి టౌన్: ఈనెల 18న గోరంట్లలో తలపెట్టిన నాయీ బ్రాహ్మణ విజయభేరి మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. పట్టణంలో శనివారం వారు మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంగళి మహాసభ జాతీయ కన్వీనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ విజయభేరి మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 33 మండలాల నాయీ బ్రహ్మణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునిప్రసాద్, కృష్ణ, నాగరాజు, నాగభూషణం, శ్రీనివాసులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టిప్పర్

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు సమీపంలోని చిత్రావతి నది నుంచి టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నట్లు ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తికి సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసి పోట్లమర్రి గ్రామం వద్ద టిప్పర్‌ను పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్, ఓనర్‌పైన కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం


బాలికలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజేంద్ర

ముదిగుబ్బ: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని ముదిగుబ్బ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేంద్ర అన్నారు. శనివారం స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, క్యాన్సర్, నులిపురుగుల నిర్మూలన, బాల్యవివాహాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు కలిగినప్పుడు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. ఈ సందర్భంగా బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందించారు. హాస్టల్ వార్డెన్ సులోచనమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ విజయకుమారి, సిబ్బంది కావేరి, హృదయాంజలి, నాగరాజు, శివమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో గుండెపోటు నివారణ సూది మందు


హృదయ రక్షపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నల్లమాడ: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండెపోటు నివారణ సూది మందు అందుబాటులో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. శనివారం హృదయ రక్షపై ఆస్పత్రిలో అవగాహన కల్పించారు. ఛాతీ నొప్పి ఎడమచేతికి, మెడ, ఛాతీ మధ్యలో వ్యాపించడం, ఛాతీలో బిగుతు అనుభూతి, శ్వాస ఆడకపోవడం, విపరీతమైన చమట, వికారం, వాంతులు, తీవ్ర బలహీనత, స్పృహ కోల్పోవడం గుండెపోటు లక్షణాలని వివరించారు. గుండెపోటు వచ్చిన గంటలోపే ఆస్పత్రికి చేరుకుంటే ప్రాథమిక చికిత్సలో భాగంగా రూ.45 వేలు విలువ చేసే ఇంజెక్షన్ ఇచ్చి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆస్పత్రిలో చేర్చుతామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: గుండె నొప్పి వచ్చిన గంటలోపు ఆసుపత్రికి రోగిని తీసుకువస్తే రూ.45వేలు ఇంజక్షన్ వేస్తున్నామని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఛాతీ నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం రావడం, గుండె దడ రావడం, స్పృహ కోల్పోవడం లాంటివి గుండెపోటు లక్షణాలన్నారు. ఇలాంటి లక్షణాలు ఉండే వ్యక్తులు వెంటనే మొదటి గంటలోపు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే టెనెక్ట్ ఫ్లస్ అనే ఇంజెక్షన్ ఉచితంగా వేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 24 మంది రోగులకు ఈ ఇంజెక్షన్ వేసి వారి ప్రాణాలను రక్షించామన్నారు.

గిరిజనుల హక్కులు కాలరాస్తే సహించం

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్


తండా వాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

చెన్నేకొత్తపల్లి: రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులను కాలరాస్తే సహించబోమని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన మండల పరిధిలోని గంగినేపల్లి పంచాయతీ పరిధిలోని మేకేనాయక్ తండా, ఎర్రోనిపల్లి తండాల్లో పర్యటించారు. మేకేనాయక్ తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా గిరిజన తండాల్లో భూ సమస్యలున్నాయని, అధికారులు వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొందరు గిరిజన భూములను ఆక్రమిస్తున్నారని, దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని కమిషన్‌కు ఫిర్యాదు అందాయన్నారు. అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం గిరిజన హక్కులు గురించి వివరించారు. తండాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని గిరిజనులకు సూచించారు. ఏదైనా సమస్యను అధికారులు పరిష్కరించకపోతే కమిషన్‌ను ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌కుమార్ నాయక్, ఎంఈఓ మున్వర్‌బాషాతో పాటు పలువురు తండా వాసులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర


పేరూరు నుంచి తిరుమలకు పాదయాత్రగా తరలివెళ్తున్న భజన బృందం సభ్యులు

రామగిరి: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులు శనివారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని కోరుతూ భజన బృందం సభ్యులు దాదాపు 20 ఏళ్లుగా తిరుమలకు పాదయాత్ర చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కూడా మోహన్‌దాస్ స్వామి ఆధ్వర్యంలో రామకృష్ణ, వెంకటరెడ్డి, రాజా, నాగరాజు, శ్రీనివాసులు, మాధవరాజు, సత్యప్ప తదితరులతో కూడిన 30 మంది సభ్యులు తిరుమలకు బయలుదేరారు. రాత్రికి వారు రాగిమేకలపల్లిలో బసచేశారు. ఆదివారం పాదయాత్ర ప్రారంభించి గోరంట్ల, వాయల్పాడు, పీలేరు, శ్రీనివాసమంగాపురం మీదుగా ఆరు రోజులు పాదయాత్ర చేసి తిరుమల చేరుకోనున్నారు.

డాక్టర్ జాకీర్ హుస్సేన్ సేవలు చిరస్మరణీయం


డాక్టర్ జాకీర్ హుస్సేన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముదిగుబ్బ: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ముస్లీం సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. శనివారం మండల కేంద్రంలో డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్, నాయకులు చింతపండు హైదర్‌వలి, అమీర్‌బాషా, సరితాల షబ్బీర్, ఇర్ఫాన్, యాసీన్, ముభారక్, ఇమ్రూ, ముస్తాక్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

గొట్లూరులో పోలీస్ పెట్రోలింగ్


గొట్లూరులో పర్యటిస్తున్న పోలీసులు

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామంలో శనివారం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్‌ఐ సిబ్బందితో గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామసభను ఏర్పాటు చేసి గొడవలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. గ్రామంలో సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

రోగులు ఫుల్... మందులు నిల్!

- 30 పడకల ఆసుపత్రిలో మందుల కొరత


ఆసుపత్రిలో మందుల కోసం వేచి ఉన్న రోగులు

తనకల్లు: స్థానిక 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో తగిన మందులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తనకల్లు, అమడగూరు, నల్లచెరువు, మొలకలచెరువు మండలాల నుంచి రోజూ 500 మందిదాకా రోగులు స్థానిక సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కు వస్తుంటారు. అయితే రెండు నెలలుగా సరిపడా మందులను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సరఫరా చేయకపోవడంతో రోగులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా బీ కాంప్లెక్స్, పారాసిటమాల్ ట్యాబ్లెట్లు, సిరప్, టానిక్‌లతో పాటు ఫారాసిటిమల్, డైక్లో, రాన్‌టాక్ తదితర ఇంజెక్షన్లులేవు. వైద్యులు రోగులకు పరీక్షించి అవసరమైన వారికి ఇంజెక్షన్లు, మాత్రలు రాసి ఇస్తున్నారు. అయితే ఆరోగ్య సిబ్బంది మాత్రలను మాత్రమే ఇచ్చి ఇంజెక్షన్లు లేవని పంపివేస్తున్నారని, దీంతో తాము ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన మందులను ఆసుపత్రికి సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయ్‌బాబును వివరణ కోరగా ఓపీ ఎక్కువగా ఉందని, మందులు, ఇంజక్షన్లు తక్కువగా ఉన్నాయన్నారు. ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అవసరమైన వాటిని బయట ఏజెన్సీల నుంచికొనుగోలు చేస్తామని చెప్పుకొచ్చారు.

11న ఘంటసాల వర్ధంతి

కదిరి టౌన్: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 51 వ వర్ధంతిని ఈనెల 11న పట్టణంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈమేరకు శ్రీఖాద్రీ ఆలయ మాజీ పాలక మండలి సభ్యుడు ఉమామహేశ్వరన్ శనివారం ప్రకటన విడుదల చేశారు. కొమరవోలు శివప్రసాద్ ఆధ్వర్యంలో సంగీత విభావం ఉంటుందని తెలిపారు. సంగీతాభిమానులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అడవికి నిప్పు

పెనుకొండ: పెనుకొండ అడవికి గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నిప్పుపెట్టారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానిక యోగా నరసింహస్వామి ఆలయం ఎదురుగా అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. బోధగడ్డి ఎక్కువగా ఉండటంతో పచ్చని చెట్లు కాలిపోయాయి. పులేకమ్మ గుడి వెనుక ప్రాంతం, పెనుకొండ కొండవైపు మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో అధికారులు, ప్రజలు మంటలను ఆర్పే సాహసం చేయలేకపాయారు. అడవికి నిప్పు పెట్టడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు.

వైభవంగా మల్లికార్జునస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో హారతులు పట్టుకున్న చిన్నారులు


వివిధ వేషధారణలతో నృత్యాలు చేస్తున్న శివ మాలధారులు

బత్తలపల్లి: గంటాపురం గ్రామంలో శనివారం రాత్రి శివమాలధారుల ఆధ్వర్యంలో శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. శనివారం గురుస్వామి గుమ్మడి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ట్రాక్టర్‌పై శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి చిత్రపటాలను ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా చిన్నారులు హారతులతో ముందుకు సాగారు. శివ మాలధారులు వివిధ వేషధారణలో నృత్యాలు చేశారు. వందలాది భక్తులు తరలివచ్చి గ్రామోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం: వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని మేదర, కుమ్మరి, శాలివాహన కులాల వారు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ప్రమోద్‌కుమార్ శనివారం తెలిపారు.ముగ్గురు లేదా ఐదుగురు గ్రూపుగా ఏర్పడి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 60 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసిన అనంతరం కులం, బర్త్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం, సెల్‌నెంబరు జతచేసి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ



బత్తలపల్లి: మాఘమాసం రెండో శనివారాన్ని పురస్కరించుకుని పోట్లమర్రి గ్రామంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమండూరు మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచే స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భజన బృందాలు భజనలు చేపట్టాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి


తిమ్మమాంబను దర్శించుకుంటున్న జడ్జి, కుటుంబ సభ్యులు

ఎన్పీకుంట: గూటిబైలు గ్రామంలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మమర్రిమానును శనివారం గుత్తి సీనియర్ సివిల్ జడ్జీ కాశీవిశ్వనాథ ఆచారి తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తిమ్మమాంబ ఆలయ కమిటీ సభ్యులు జడ్జి కటుంబ సభ్యులకు స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. అనంతరం జడ్జి తిమ్మమాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టూరిజం గైడ్ మనోహర్ మర్రిమాను విశిష్టత, ఆలయ చరిత్రను వివరించారు.

వైభవంగా ఉమా త్రిలింగేశ్వర స్వామి కల్యాణం


స్వామివార్లకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పేటబసవన్నకట్టవీధిలోని త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉమా త్రిలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు రాఘవేంద్రశర్మ, విజయ్‌కుమార్‌శర్మ శిష్య బృందం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపించారు. వేలాది మంది భక్త జనం ఈ తంతును తిలకించి తరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జెన్నే వెంకటేష్, ఉపాధ్యక్షులు జెన్నే సురేష్‌కుమార్, ఆర్గనైజర్ బాలకృష్ణారెడ్డి, కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తిక్కనారాయణస్వామి ఆరాధన


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్యగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం సమీపంలోని అవధూత తిక్క నారాయణస్వామి 53వ ఆరాధన శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తినిస్తాయని సీఐ తెలిపారు. అనంతరం తిక్క నారాయణస్వామి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. శ్రీకృష్ణ చైతన్య భక్త భజన మండలి సభ్యులు కళ్యాణ్, నాగరాజు, సత్యమూర్తి, చలపతి, సంజీవరాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: ఉస్తినిపల్లిలో వెలసిన హజరత్ బాబాఫక్రుద్దీన్‌షా ఖాద్రీ, హజరత్ నాసర్ అలీషా, హజరత్ రహంతుల్లాషా ఖాద్రీ దర్గాలో శనివారం ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హజరత్‌ల సమాధుల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఫాతేహా అనంతరం భక్తులు తమ ముడుపులను తీర్చుకున్నారు. చుట్టుపక్కల మండలాల నుంచే కాకుంగా పొరుగు ఉన్న అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, తంబళ్లపల్లి, కందుకూరు, బద్వేల్ ప్రాంతాల నుంచి భక్తాదులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా ఆదివారం తహలీలు ఫాతేహా గంధంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని దర్గా ధర్మకర్త సలీంకొండషా, నిర్వాహకులు తెలిపారు.